క్లుప్తంగా

కొమ్మినేని శ్రీనివాస్‌రావు అరెస్ట్ అప్రజాస్వామికం

ఇల్లందకుంట: ప్రజా గొంతుక సాక్షి సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాస్‌రావును అక్రమంగా అరెస్ట్ చేయడం సిగ్గుచేటని సీపీఎం మండల కార్యదర్శి చెల్పూరి రాము అన్నారు. సోమవారం మండల కేంద్రంలో మాట్లాడారు. లైవ్ డిబేట్‌లో ఎవరో మాట్లాడిన మాటలకు శ్రీనివాస్‌రావుకు సంబంధం ఏంటని ప్రశ్నించారు. రాజకీయ కక్షలో భాగంగా అరెస్ట్ చేసి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టడం అప్రజాస్వామికమని విమర్శించారు.

దివ్యాంగులకు రూ.6 వేల పెన్షన్ ఇవ్వాలి

ఇల్లందకుంట: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలో భాగంగా దివ్యాంగులకు రూ. 6 వేల పెన్షన్ ఇవ్వాలని జనతాదళ్(సెక్యులర్) పార్టీ జేడీఎస్ రాష్ట్ర కార్యదర్శి వాసు వడ్లూరి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీని పూర్తిగా మరిచిపోయిందని, సీఎం రేవంత్‌రెడ్డికి దివ్యాంగులపై చిత్తశుద్ధి ఉంటే రూ.ఆరువేల పెన్షన్ మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

‘తల్లి లాంటి బీఆర్‌ఎస్‌ను విమర్శించడం సరికాదు’

చిగురుమామిడి: ప్రజల పక్షాన ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహిస్తే మాజీ జెడ్పీటీసీ గీకురు రవీందర్ రాజకీయ ఉనికి కోసమే ధర్నాలు చేస్తారని వ్యాఖ్యానించడం సరికాదని బీఆర్‌ఎస్ నాయకులు అన్నారు. సోమవారం చిగురుమామిడిలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ నుంచి రెండుసార్లు సర్పంచ్, జెడ్పీటీసీగా ఎన్నికైన రవీందర్ కన్న తల్లి లాంటి బీఆర్‌ఎస్‌ను విమర్శించడం, మంత్రిగారి మెప్పుకోసమే మాట్లాడుతున్నారని, ఎన్నికల హామీల అమలుపై పోరాటం చేస్తామన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మండలశాఖ అధ్యక్షుడు మామిడి అంజయ్య, మండల ప్రచార కార్యదర్శి బెజ్జంకి రాంబాబు, మండల బీసీ సెల్ అధ్యక్షుడు హన్మాండ్ల సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ కత్తుల రమేశ్, మాజీ రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు పెనుకుల తిరుపతి, మాజీ సర్పంచ్ వెంకటేశం, నాయకులు పిల్లి వేణు, దొనపాటి కిష్టారెడ్డి, దామ శ్రీనివాస్ పలువురు పాల్గొన్నారు.

ముదిరాజ్‌ల సంబరాలు



చిగురుమామిడి: రాష్ట్ర మంత్రివర్గంలో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి చోటు దక్కడంతో మండల కేంద్రంలో ముదిరాజ్ సంఘం నాయకులు సోమవారం సంబరాలు నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహం ఎదుట టపాసులు పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. మాజీ జెడ్పీటీసీ, ముదిరాజ్ మహాసభ జిల్లా ప్రధానకార్యదర్శి గీకురు రవీందర్ మాట్లాడారు.. ముదిరాజ్‌ల నుంచి వాకిటి శ్రీహరికి మంత్రివర్గంలో చోటు కల్పించడం సామాజిక న్యాయానికి పెద్దపీట వేసినట్లేనని అన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ జిల్లా కార్యదర్శి కూన మహేందర్, ముదిరాజ్ సంఘం నాయకులు పెసరి శ్రీనివాస్, కూన వెంకటేశ్, బరిగెల సదానందం, మొగిలి, రాజ్‌కుమార్, కనుకయ్య, సంపత్, కుమార్, సతీష్, స్వామి, అనంత రాములు, మల్లయ్య పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సు వినియోగించుకోవాలి

జమ్మికుంట: భూ సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ నల్ల వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం వావిలాల, నగురం, నాగారం, పాపక్కపల్లి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించగా 161 దరఖాస్తులు వచ్చాయన్నారు. రెవె న్యూ సదస్సును జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వప్న సందర్శించారు. కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్‌ఐలు సత్యనారాయణ, శంకర్, ఎంపీఎస్‌వో, సర్వేయర్, సిబ్బంది పాల్గొన్నారు.

కందుగులలో..

హుజూరాబాద్: మండలంలోని కందుగుల గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో సోమవారం భూభారతి రెవెన్యూ సదస్సు నిర్వహించామని తహసీల్దార్ కె. కనకయ్య తెలిపారు. సదస్సులో 184 దరఖాస్తులను స్వీకరించామన్నారు. భూ సమస్యల పరిష్కారం త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం



తిమ్మాపూర్: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు గణితం బోధనకు అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ వనజ తెలిపారు. ఎమ్మెస్సీ (మ్యాథ్స్), బీఎడ్, బోధన అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యం ఇస్తామని, ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా ఉంటుందని, ఈ నెల 12వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని 13న డెమో నిర్వహిస్తామని వివరాలకు మోడల్ స్కూల్‌ను సంప్రదించాలని సూచించారు.

మూతపడి ఆరేళ్లకు పైనే..

- రేకొండ గ్రామంలో విరాళాలతో మినరల్ వాటర్ ప్లాంట్
- పట్టించుకునేవారు కరువు
- ప్రజలు ఫ్లోరైడ్ బారిన పడొద్దని ఏర్పాటు



రేకొండలో మూతపడిన వాటర్ ప్లాంట్

చిగురుమామిడి: మండలంలోని రేకొండ గ్రామంలో ప్రజా విరాళాలతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్ మూతపడింది. ఫ్లోరైడ్ నీటితో గ్రామ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గ్రహించిన దివంగత సీపీఐ నేత, మాజీ ఎంపీపీ చాడ ప్రభాకర్‌రెడ్డి ప్రజా విరాళాలతో 2008లో ప్లాంట్‌కు శ్రీకారం చుట్టారు. గ్రామానికి చెందిన దాదాపు 450 మంది నుంచి రూ.మూడు వందలు, మరో 200 మంది నుంచి రూ.ఐదువందల చొప్పున వసూలు చేశారు. ఊర చెరువు కట్టకింద రేకుల షెడ్డు నిర్మించి, బోర్‌వెల్ వేశారు. అలాగే నీటి శుద్ధీకరణయంత్రాలను కొనుగోలు చేశారు. 2010లో అప్పటి సీపీఐ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. అప్పటి నుంచి మాజీ ఎంపీపీ చాడ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో మినరల్ వాటర్ ప్లాంట్ నిర్వహణ సజావుగా సాగిందని గ్రామస్తులు తెలిపారు. మాజీ ఎంపీపీ మరణానంతరం ఇద్దరు గ్రామ ప్రముఖులు నిర్వాహణ బాధ్యతలు స్వీకరించారు. దాదాపు ఆరేళ్లుగా ప్లాంట్ మూతపడింది, బోర్ కరెంటు బిల్లు రూ.లక్ష ఉందని, వాటిని చెల్లించేవారులేకపోవడంతో పాటు నీటిశుద్ధీకరణ యంత్రాలు ఉన్నాయా లేదా అనే సందేహాలను ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. మూతపడిన ప్లాంట్‌ను పునఃప్రారంభించాలని కోరుతున్నారు. అలాగే మూతపడటానికి కారకులైనవారు బయటకు రాకుంటే విరాళాలు ఇచ్చినవారు కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.



విరాళం ఇచ్చి తీసుకున్న రశీదు

ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యం

చొప్పదండి: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే లక్ష్యంగా బడిబాట కార్యక్రమం కొనసాగుతుందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మండలంలోని చాకుంటలో సోమవారం నిర్వహించిన బడిబాటలో పాల్గొన్నారు. ఎంఈవో మోహన్, ఏఎంసీ చైర్మన్ మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

రామడుగు: మండలంలోని పలు గ్రామాలలో ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటా తిరుగుతూ పిల్లలను సర్కారు బడుల్లో చేర్పించాలని కోరుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. మోతె గ్రామ పరిధిలోని గాండపల్లిలో రుద్రారం పాఠశాల హెచ్‌ఎం రంగనాథశర్మ, ఉపాధ్యాయులు అవధూత శ్రీనివాస్, సరోజినీ, సునీత, రమేష్‌లు పాల్గొన్నారు.

శంకరపట్నం: కార్పొరేట్ స్కూల్ తరహాలో ప్రభుత్వ పాఠశాలలో విద్య బోధిస్తున్నామని మండలంలోని మొలంగూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల టీచర్లు అన్నారు. వాలీబాల్ క్రీడకు వన్నెతెచ్చిన మొలంగూర్ జిల్లా పరిషత్ స్కూల్ పూర్వవైభవం కోసం గ్రామస్తుల సహకారంతో ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేశారు.

చిగురుమామిడి: మండలంలోని పలు గ్రామాల్లో విద్యావాహిని ప్రచార రథంతో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఎంఈవో పావని ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం చేశారు. హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు, అంగన్‌వాడీ టీచర్లు, అమ్మ ఆదర్శపాఠశాలల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇల్లందకుంట: విద్యార్థుల బంగారు భవిష్యత్ కోసం ప్రభుత్వ పాఠశాలలు కృషి చేస్తాయని మండల విద్యాధికారి రాములు అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యావాహిని ప్రచార రథాన్ని హెచ్‌ఎం జయప్రకాశ్‌తో కలిసి ప్రారంభించారు. తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. అనంతరం మాజీ ఎంపీటీసీ రామ్‌స్వరణ్‌రెడ్డి మాట్లాడుతూ...ఇల్లందకుంట పాఠశాలకు మంచిపేరు ఉందని, ప్రస్తుత ఉపాధ్యాయ బృందం ఎంతో కృషి చేస్తున్నారని, ఈ సంవత్సరం పదిలో వందశాతం ఉత్తీర్ణత సాధించి మండలంలోనే ఉన్నత పాఠశాలగా పలువురి మన్ననలు అందుకుందన్నారు. పిల్లలను పాఠశాలలో చేర్పించి స్కూళ్ల బలోపేతానికి పాటుపడాలన్నారు. ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం గోపి, నాయకులు సురేందర్‌రెడ్డి, టీచర్లు సీహెచ్.వేణు, సత్యం, సమ్మిరెడ్డి, అన్నపూర్ణ, రామకృష్ణ, సుధాకర్, శంకర్, ఐలయ్య, సురేష్, పరమేష్, వీరస్వామి, వరలక్ష్మి, సతీష్ పాల్గొన్నారు.



చొప్పదండి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యం



రామడుగులో కరపత్రం అందజేస్తున్న టీచర్లు



శంకరపట్నం: మొలంగూర్‌లో..



ఇల్లందకుంట: విద్యావాహిని ప్రచార రథం ప్రారంభిస్తున్న ఎంఈవో రాములు



చిగురుమామిడి: ఉల్లంపల్లిలో ఉపాధ్యాయుల బడిబాట

నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించొద్దు



మాట్లాడుతున్న సీపీఐ కార్యకర్తలు

చిగురుమామిడి: మండల పరిషత్ కార్యాలయం ముట్టడికి సీపీఐ కార్యకర్తలు యత్నించారు. సోమవారం పార్టీ మండలశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమానికి జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ హాజరయ్యారు. ఉదయం తాళం తీయకముందే కార్యాలయం ఎదుట బైఠాయించి ఎంపీడీఓ వైఖరిపై నిరసన తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువవికాసం పథకాలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు చెప్పిన వారిపేర్లను మాత్రమే ఎంపికచేయడం ఏంటని, అధికార పార్టీకి తొత్తుగా వ్యవహరిస్తున్న ఎంపీడీఓ మధుసూదన్‌పై జిల్లా ఉన్నతాధికారులు విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఎస్సై శ్రీనివాస్ కార్యకర్తలను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు పారదర్శకంగా అందాలని, అధికారులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం సరికాదని పంజాల శ్రీనివాస్ ఆరోపించారు.

కేంద్ర మంత్రికి వినతి

హుజూరాబాద్: పట్టణంలో మినీ స్టేడియం ఏర్పాటుకు కృషి చేయాలని కోరుతూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడిరెడ్డి, బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో నాయకులు సోమవారం కేంద్రహోంశాఖ సహాయ మంత్రి, కరీంగనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్‌కు వినతి పత్రం సమర్పించారు.

సీఐల బదిలీలు

కరీంనగర్‌క్రైం: మల్టీజోన్ వన్‌లో పలువురు సీఐలను బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. రామగుండం ఎస్బీలో పనిచేస్తున్న పెరుక కరుణాకర్‌ను జగిత్యాల టౌన్ సీఐగా, చెన్నూరు సీఐగా పనిచేస్తున్న దామెద సుధాకర్‌ను జగిత్యాల రూరల్ సర్కిల్‌కు బదిలీ చేశారు. జగిత్యాల టౌన్ సీఐగా పనిచేస్తున్న వేణుగోపాల్, జగిత్యాల రూరల్ సీ ఐగా పనిచేస్తున్న కృష్ణారెడ్డిలను ఐజీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ

చిగురుమామిడి: మండలంలోని బొమ్మనపల్లి లో సోమవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి నాయకులు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి నాగరాజు, కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు రమణయ్య, నాయకులు, పాల్గొన్నారు.

గన్నేరువరం: మండలంలోని గునుకులకొండాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్లకు నాయకులు భూమిపూజ చేశారు. పంచాయతీ కార్యదర్శి రాజేష్, పార్టీ గ్రామ అధ్యక్షుడు రవికుమార్‌గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కనుకయ్యగౌడ్, మాజీ సర్పంచ్ మల్లేశంగౌడ్, నాయకులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

జమ్మికుంట: మున్సిపల్ పరిధి 8, 22వ వార్డుల్లో కాంగ్రెస్ నాయకులు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్ అందజేసి భూమిపూజలో పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సొంతింటి కలను సాకారం చేస్తుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజా పాలన కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు రమేష్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, పట్టణ మహిళా అధ్యక్షురాలు రేణుక శివకుమార్‌గౌడ్, మాజీ కౌన్సిలర్ మల్లయ్య, యూత్ నాయకులు ఎండీ సజ్జు, శ్రీనివాస్, ప్రవీణ్, రాజ్‌కుమార్,ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి



తేజసాయిశ్రీ(ఫైల్)

చొప్పదండి: క్షణికావేశంలో ఆత్మహత్యకు పాల్పడిన వివాహిత చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందిందని ఎస్ఐ నరేశ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని చాకుంటకు చెందిన ఎడ్ల తేజసాయిశ్రీ (30) ఈ నెల 5న రాత్రి భర్త ఇంటికి రాలేదని గొడవపడింది. మరుసటి రోజు ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి మందు తాగింది. స్థానికులు 108లో కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలికి పాప, బాబు ఉన్నారు. తహసీల్దార్ నవీన్‌కుమార్, ఎస్ఐ నరేశ్‌రెడ్డి పంచనామా నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

శంకరపట్నం: మండలంలోని అంబాల్‌పూర్ గ్రామశివారులో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయని స్థానికులు తెలిపారు. గ్రామానికి చెందిన సముద్రాల మల్లయ్య(45), ఎండీ. రఫీక్(12)తో కలిసి మోపెడ్‌పై కేశవపట్నం వెళ్తుండగా డివైడర్‌ను ఢీకొనడంతో మల్లయ్యకు తీవ్ర, రఫీక్‌కు స్వల్పగాయాలయ్యాయి. ఈఎంటీ సతీశ్‌రెడ్డి ప్రథమ చికిత్స చేసి 108లో కరీంనగర్‌కు తరలించారు.

కట్నం వేధింపు కేసు

క్రైం వార్తలు

జమ్మికుంట: అదనపు కట్నం కోసం వేధింపులకు పాల్పడిన ఆరుగురిపై సోమవారం కేసు నమోదు చేశామని టౌన్ సీఐ ఎస్. రామకృష్ణ తెలిపారు. మండలంలోని నాగంపేట గ్రామానికి చెందిన వనితకు వరంగల్‌కు చెందిన నంగి శరత్‌కుమార్‌తో పదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు ఆడపిల్లలు. భర్త, అత్త తిరుపతమ్మ, ఆడపడుచులు వారి భర్తలు బైరి సరిత, రవీందర్, జంగిలి సమంత, రాజేశ్వర్‌రావు ఆడపిల్లలు పుట్టారు అదనపు కట్నం తీసుకురావాలని వేధింపులకు పాల్పడగా బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని సీఐ వివరించారు.

హత్యాయత్నం కేసులో నలుగురికి రెండేళ్ల జైలు

కరీంనగర్‌క్రైం: ఆస్తి విషయంలో సొంత తమ్ముడితో పాటు అతడి బంధువుపై హత్యాయత్నంకు పాల్పడిన కేసులో అన్నతోపాటు అతనికి సహకరించిన మరో ముగ్గురికి రెండేళ్ల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికీ రూ.1,000 జరిమానా విధిస్తూ కరీంనగర్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కె.రాణి సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. చొప్పదండి మండలం ఆర్నకొండకు చెందిన ముగ్గురు అన్నదమ్ములలో కనకట్ల రమేశ్ చిన్నవాడు. ఇతను కులాంతర వివాహం చేసుకోగా, అతని అన్నలు మహేశ్, సురేశ్‌లకు ఇష్టం లేదు. అయితే తనకు చెందిన ఉమ్మడి ఆస్తి మూడు ఎకరాలను తన అన్నలు తనకు తెలియకుండా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని, దీంతో పాటు ఆరు గుంటల భూమిని మహేశ్ ఆక్రమించి ఇల్లు కట్టుకున్నాడని, తన పెళ్లికి ముందు కొన్న 11 గుంటల భూమి ఆక్రమించేందుకు ప్రయత్నించారని రమేశ్ అన్న కనకట్ల మహేశ్‌కు వ్యతిరేకంగా నిర్ణయం తీసుకున్నారు. దీనిపై కక్ష పెంచుకున్న మహేశ్, అతడి స్నేహితులు రాజయ్య, మహేశ్, శేఖర్‌లు 2023 జూన్ 11న రాత్రి రమేశ్‌తో పాటు తన బావ మరిది సతీశ్‌పై కత్తులతో దాడి చేసి తీవ్రంగా గాయపర్చారని రమేశ్ చొప్పదండి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తెలిపాడు. అతడి ఫిర్యాదు ఆధారంగా పోలీసులు నలుగురిపై కేసు నమోదు చేయగా సీఐ రవీందర్ దర్యాప్తు జరిపారు. సాక్షులను అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గడ్డం లక్ష్మణ్ కోర్టులో ప్రవేశపెట్టి విచారించారు. పరిశీలించిన న్యాయమూర్తి నలుగురికి రెండేళ్ల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికీ రూ.1000 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

గంగాధర: మండలంలోని వెంకటాయిపల్లి గ్రామంలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిందని ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. ఆదివారం సాయంత్రం ఉప్పుగండ్ల గంగారెడ్డి ఇంటికి తాళం వేసి మంచినీళ్లు తీసుకురావడానికి వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి తాళం పగలగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని 33 తులాల బంగారం, వెండి, నగదు దొంగిలించారు. సోమవారం బాధితుడి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

ఎనర్జీ ప్లాంట్ నిర్మించొద్దు

హుజూరాబాద్: మండలంలోని సిర్సపల్లి గ్రామ శివారులో చెత్త ఆధారిత విద్యుత్ ఎనర్జీ ప్లాంట్‌ను నిర్మించొద్దని కోరుతూ సోమవారం రైతులు, ప్రజలు బైక్‌లపై ర్యాలీగా పట్టణంలోని ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయానికి ర్యాలీగా వచ్చి నిరసన వ్యక్తం చేశారు. గ్రామ సమీపంలోని గుట్టల్లో ఎనర్జీ ప్లాంట్ ఏర్పాటు చేయడం ద్వారా సమీప గ్రామాల ప్రజలు అనారోగ్యం బారిన పడతారని, అలాగే పర్యావరణానికి హానీ కలిగే అవకాశం ఉందని, ప్లాంట్ నిర్మాణాన్ని విరమించుకోవాలని కోరారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు.

ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం

హుజూరాబాద్: మున్సిపాలిటీ పరిధి 5,7వ వార్డుల్లో సోమవారం మున్సిపల్ ఆధ్వర్యంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం నిర్వహించినట్లు మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య తెలిపారు. బతుకమ్మ సొల్లు, చిలుకవాగు వద్ద రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలు, చెత్తా చెదారం తొలగించారు. చిలుకవాగులో నీరు వెళ్లకుండా అడ్డుగా ఉన్న గడ్డి, చెత్తాచెదారం, మొక్కలను జేసీబీ సహాయంతో తొలగించామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు సుధాకర్, రవీందర్, రాజయ్య,పి. వినయ్, సుధీర్, ప్రతాప రాజు,ఆరెల్లి రమేష్, టి. కుమారస్వామి, పి. అనిల్ కుమార్ పాల్గొన్నారు.

నిశీధిలోనూ ప‘రేషన్’



రేషన్ పంపిణీ ప్రక్రియ కార్డుదారులకు ప్రహసనంగా మారింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బియ్యం పంపిణీ వేర్వేరుగా జరుగుతుండగా వేలిముద్రలు ఆరుసార్లు పెట్టాల్సి వస్తోంది. దీంతో ఒక కార్డుకు రేషన్ పంపిణీ చేయాలంటే 20–30 నిమిషాలు పడుతుండగా రోజుకు 30కి మించి పంపిణీ చేయడం లేదు. కార్డుదారుల నిరీక్షణ తప్పకపోగా రాత్రయినా రేషన్ దుకాణం వద్ద పడిగాపులు కాస్తున్నారు. సోమవారం కరీంనగర్‌లోని రాంనగర్‌లో గల రేషన్ దుకాణం వద్ద రాత్రి 9 గంటల వరకూ బియ్యం పంపిణీ చేస్తున్న దృశ్యాన్ని ‘సాక్షి’ క్లిక్‌మనిపించింది. – కరీంనగర్ అర్బన్

అవగాహన సదస్సు



మాట్లాడుతున్న రాజిరెడ్డి

జమ్మికుంట: ప్రభుత్వ పాఠశాలల విలీనం మానుకోవాలని డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజిరెడ్డి అన్నారు. పట్టణంలోని బాలుర పాఠశాలలో సోమవారం డీటీఎఫ్ మండల అధ్యక్షుడు వేణుమాధవ్ ఆధ్వర్యంలో సెలవు నిబంధనలు, ప్రభుత్వ ఉత్తర్వులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రభుత్వం పాఠశాలలను కుదించాలనే కుట్ర పన్నుతోందని ఆరోపించారు. ప్రాథమిక పాఠశాలలకు ఐదు తరగతి గదులు, టీచర్లను నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు రఘుశంకర్‌రెడ్డి, రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ ఈశ్వర్‌రెడ్డి, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు నరహరి, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శులు తిరుపతి, చక్రధర్, జమ్మికుంట, ఇల్లందకుంట మండల ప్రధాన కార్యదర్శులు రాజేందర్, సంపత్, రాగిణి, లహరి అనూష, ప్రవీణ, హరీశ్, సంపత్ పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

శంకరపట్నం: మండలంలోని తాడికల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2004–05 పదో తరగతి విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. మొలంగూర్ శివారులోని ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ చదువుకున్న రోజులనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం చదువు చెప్పిన టీచర్లను ఘనంగా సన్మానించారు.

బీజేపీ నాయకుల సంబరాలు



కరీంనగర్ టౌన్: ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్‌లు పదవీ బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా బీజేపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం కరీంనగర్‌లోని తెలంగాణచౌక్‌లో సంబరాలు నిర్వహించారు. టపాసులు పేల్చి కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మాజీ మేయర్ సునీల్‌రావు, పార్టీ మాజీ అధ్యక్షుడు బాస సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్‌గౌడ్, వెంకటరెడ్డి, బత్తుల లక్ష్మీనారాయణ, ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కరీంనగర్ వాసులకు అవార్డులు



అవార్డులు అందుకున్న వివిధ రంగాల ప్రముఖులు

కరీంనగర్ టౌన్: తెలంగాణ ఫార్మేషన్ డే, పర్యావరణ దినోత్సవం, నేషనల్ ఫ్రెండ్‌షిప్ డే సందర్భంగా తెలంగాణ ప్రభుత్వ సాంస్కృతిక శాఖ సౌజన్యంతో జీసీఎస్ వల్లూరి ఫౌండేషన్, శ్రీప్రగతి ఫౌండేషన్ సంయుక్తంగా వివిధ రంగాల్లో సేవలందిస్తున్న ప్రముఖులైన నిష్ణాతులను గుర్తించి సోమవారం హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో జాతీయ బంగారు నంది అవార్డులతో సత్కరించింది. వైద్య రంగంలో విశేష సేవలందిస్తున్న వాసుదేవ హాస్పిటల్ అధినేత డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్, ప్రభుత్వ విభాగంలో ఇంజినీరుగా సేవలందిస్తున్న ఈద కుమారస్వామి, ప్రైవేటు విభాగంలో ఇంజినీరుగా సేవలందిస్తున్న కోల అన్నారెడ్డిని మాజీ మంత్రి, సినీ నటుడు బాబు మోహన్, కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాల చారి, ఆచార్య దైవిజ్ఞ శర్మ, మల్కాజ్‌గిరి అడిషనల్ డీసీపీ వెంకటరమణగారు, సినీ ప్రముఖులు దొరై స్వామి, దర్బార్ చంద్రశేఖర్ అవార్డులతో సన్మానించారు.

భూంరెడ్డి మృతి బాధాకరం

కరీంనగర్: ఉత్తర తెలంగాణ జిల్లాల్లో మొట్టమొదటి సర్జన్‌గా పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్న డాక్టర్ వి.భూంరెడ్డి మృతి బాధాకరమని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. వ్యక్తిగతంగా ఆయనతో నాకు అత్యంత సన్నిహిత సంబంధాలు ఉండేవని తెలిపారు. సంతాపం ప్రకటిస్తూ వారి కుటుంబానికి సానుభూతి తెలుపుతున్నామని అన్నారు. వైద్యుడు వి.భూంరెడ్డి మృతికి మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. 91 ఏళ్ల వరకు వైద్యం అందించడం నిజంగా గొప్ప విషయమని పేర్కొన్నారు.

సన్మానం

హుజూరాబాద్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ నల్ల నారాయణరెడ్డిని తెలంగాణ బీసీ సిటిజన్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చందుపట్ల జనార్దన్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య,బీసీ సిటిజన్ ఫోరం బాధ్యులు జనార్ధన్, వెంకన్న, రవీందర్, సదానందం,శ్రీనివాస్ తదితరులున్నారు.